సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 11 । మార్చి । 2023



రక్తదానంతో ప్రాణదానం

రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. IIలో



గోదావరి డెల్టాకు నీటి విడుదల

డొంకరాయినుంచి రోజుకు 2500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఎస్‌ఈ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. IIలో

అస్తమించే వేళ..



రాజవొమ్మంగి: అస్తమించే వేళ భానుడు మోడు వారిన తాటి చెట్టుపై దీపం మాదిరిగా ఒదిగి పోయి ఆకట్టుకు న్నాడు.

న్యూస్‌రీల్

జర్మనీ వనిత బుల్లెట్‌పై పర్యటన



బుల్లెట్‌పై పర్యటిస్తున్న మార్థానో

సాక్షి,పాడేరు: జర్మనీకి చెందిన పర్యాటకురాలు మార్థానో బులెట్ వాహనంపై పర్యటిస్తూ సందడి చేశారు. మూడునెలలుగా దేశంలో వివిధ రాష్ట్రాల్లో పర్యటించిన ఆమె శుక్రవారం చింతూరు, సీలేరు, చింతపల్లి, లంబసింగి, జి.మాడుగుల మీదుగా పాడేరు చేరుకున్నారు. ఇక్కడి నుంచి ఆమె అరకు వెళ్లారు.

ఫీడర్ అంబులెన్సు సేవలు మరింత విస్తృతం



ఫీడర్ అంబులెన్స్ రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా మేనేజర్ బాలకృష్ణ

రంపచోడవరం : ఏజెన్సీ ప్రాంతంలో ఫీడర్ అంబులెన్స్ సేవలు మరింత విస్తృత పరిచేందుకు కృషి చేస్తున్నామని జిల్లా మేనేజర్ వైబీ బాలకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక అడిషనల్ డీఎంహెచ్‌వో అనూషాను కలిశారు. పలు అంశాలపై చర్చించారు. ఫీడర్ అంబులెన్సు సేవల్లో నెలకొన్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ఫీడర్ అంబులెన్సు సేవలను ఆయన తనిఖీ చేశారు. రంపచడవరం పరిధిలోని మొబైల్ వెటర్నరీ వాహనాలను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న కోటిబాబు

మారేడుమిల్లి : మారేడుమిల్లి గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వై.రామవరం మండలం పాతకోట గ్రామానికి చెందిన బోరగా కోటి బాబు మారేడుమిల్లి నుంచి రంపచోడవరం వెళ్తుండగా గ్రామ శివారులో ఎదురుగా వెళ్తున్న మరో బైకును వెనుకనుంచి ఢీకొట్టాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం రంపచోడవరం తరలించారు.

క్లైమాక్స్‌కు ప్రచార పర్వం
పోలింగ్‌కు సిద్ధం



- నేటి సాయంత్రం 4 గంటలతో ముగియనున్న ప్రచారం
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- ఎన్నికల సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ
- బూత్‌ల వారీగా సామగ్రి పంపిణీ

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పర్వం శనివారం సాయంత్రం 4 గంటలతో ముగియనుంది. ఇప్పటికే ఆయా పార్టీల మద్దతు అభ్యర్థులతో పాటు స్వతంత్రులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. చివరి రోజు కావడంతో.. మరోసారి అన్ని ప్రాంతాల్లోనూ మద్దతుదారులతో జోరుగా ప్రచారం నిర్వహించేందుకు వ్యూహరచన చేసుకున్నారు. మరోవైపు ఈనెల 13న పోలింగ్‌కు అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు దాదాపు పూర్తి చేసింది. సిబ్బందిని పూర్తి స్థాయి సుశిక్షితులను చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

శనివారం సాయంత్రం 4 గంటలకు ఉత్తరాంధ్ర జిల్లాలు నిశ్శబ్దంగా మారనున్నాయి. సార్వత్రిక ఎన్నికల స్థాయిలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు కూడా పలువురు అభ్యర్థులు జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ నెల 13న ఉదయం 8 గంటలకు పోలింగ్ మొదలు కానుంది. సాయంత్రం 4 గంటల లోపు పోలింగ్ స్టేషన్లలోనికి వచ్చిన వారికి మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనుమతించనున్నారు. మరోవైపు ఎన్నికల కమిషన్ తరపున సచివాలయ ఉద్యోగుల ద్వారా ఓటరు స్లిప్పులు పంపిణీ సజావుగా నిర్వహిస్తున్నారు. వీరితో పాటు పార్టీల వారీగా తమ మద్దతు అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వెయ్యాలని అభ్యర్థిస్తూ.. ఓటర్లకు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాలు కూడా జోరుగా జరుగుతున్నాయి. ఆయా జిల్లాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలకు ఇప్పటికే ఎన్నికల మెటీరియల్ తరలింపు ప్రక్రియను దాదాపు పూర్తి చేశారు. రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున, ఏఆర్‌వో, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలకు ఒక అభ్యర్థి తరఫున ఒక పోలింగ్ ఏజెంట్‌ను మాత్రమే అనుమతించారు.

కట్టుదిట్టమైన భద్రత నడుమ..

ఈ నెల 13వ తేదీన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, జేసీ కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి ఎన్నికల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోనల్ అధికారులు పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ వారి వారి జోన్లలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, పోలింగ్ సిబ్బంది టీమ్‌లు సకాలంలో పోలింగ్ బూత్‌కు చేరేలా పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లను సమన్వయపర్చాలన్నారు. రిటర్నింగ్ అధికారికి పోలింగ్ పర్సంటేజీను టైమ్ టు టైమ్ తెలియజేయాలన్నారు. పోలీసు అధికారులు పోలింగ్ జరిగే సమయంలో బూత్‌ల లోపలికి వెళ్లకూడదని సూచించారు. అవసరమైతే పోలింగ్ అధికారి సూచనల మేరకు మాత్రమే పోలీస్ అధికారులు పోలింగ్ బూత్‌లో స్పందించాలని స్పష్టం చేశారు.



ఎన్నికల ఏర్పాట్లను సమీక్షిస్తున్న రిటర్నింగ్ అధికారి మల్లికార్జున, పోలీసు కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్

పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలపై పోలీసు అధికారులతో సమీక్షించినట్లు స్పష్టం చేశారు. స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ తదితర టీమ్‌లను ఏర్పాటు చేసి వారి విధుల గురించి వివరించామన్నారు. ఏజెంట్లు, ఓటర్లు ఓటింగ్ సమయంలో మొబైల్ ఫోన్లు తీసుకొని రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల జోనల్ అధికార్లు, పోలింగ్ అధికార్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీసీపీ సునీల్ సుమిత్ గరుడ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.







విశాఖ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం మాక్ పోలింగ్, కౌంటింగ్ నిర్వహించారు. ఓటింగ్ కంపార్ట్‌మెంట్ల తయారీ, బ్యాలెట్ బాక్సుల తరలింపు, బ్యాలెట్ పేపర్ల లెక్కింపు తదితర దృశ్యాలివి..

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి

- ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



పట్టభద్రుల ఓటర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు

జి.మాడుగుల: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రులు ఓటు వేసి గెలిపించాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో పట్టభద్రుల ఓటర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సుధాకర్‌ను గెలిపించడం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధికి ఓటు వేసినట్టేనన్నారు. ప్రభుత్వం అన్ని రంగాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వారు పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు అండగా ప్రభుత్వం, మేమున్నామని వారు భరోసా ఇచ్చారు.ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, పాడేరు ఎంపీపీ రత్నకుమారి, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మత్స్యరాస మత్స్యరాజు సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎస్ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల ఎన్నికల పరిశీలకుడు, పాడేరు మాజీ ఎంపీపీ ఎంవీవీ రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జీ మత్స్యకొండం నాయుడు, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర, సచివాలయం మండల కన్వీనర్ కల్యాణ్, మైనారిటీ సెల్ జిల్లా కన్వీనర్ నాగూరుబాబు పాల్గొన్నారు.

ఆకును మలిచి..అందంగా తీర్చిదిద్ది,,



రంపచోడవరం మండలం తాటివాడ గ్రామంలోని మడకం బాపిరాజుదొర కాలనీకి చెందిన గిరి మహిళలు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. స్థానికంగా లభ్యమయ్యే తాటాకులతో కళాకృతులను తయారుచేసి విక్రయిస్తున్నారు. తద్వారా వచ్చే ఆదాయంతో ఆర్థికాభివృద్ధి సాధిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. - వివరాలు II లో

ముఖ హాజరు తప్పనిసరి

- స్పందన వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: అన్ని ప్రభుత్వ శాఖల్లో అధికారులు, ఉద్యోగులు విధిగా ముఖ హాజరు వేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో పీవో రోణంకి గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ వి.అభిషేక్ తో కలిసి శుక్రవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. అన్ని కార్యాలయాలకు అధికారులు, ఉద్యోగులు సకాలంలో హాజరు కావాలని, సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ముఖ హాజరు వేయకుండా ఉద్యోగుల జీతాల డ్రా చేస్తే వివరణ ఇవ్వాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. అధికారులు మండలాల్లో పర్యటించి స్పందన సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. జిల్లా అధికారులు హాజరు కాకుండా దిగువ స్థాయి అధికారులను పంపిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కోర్టు కేసులను పర్యవేక్షించాలని, వీటికి సంబంధించి కౌంటర్ ఫైల్ దాఖలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, డీఈవో సలీంబాషా, ఈఈలు డీవీఆర్‌ఎం రాజు, కె.వేణుగోపాల్, కొండయ్యపడాల్, లావణ్యకుమార్, బాలసుందరబాబు, ఉద్యానవనశాఖ జిల్లా అధికారి రమేష్, వ్యవసాయాధికారి నందు, డీపీవో కొండలరావు, డీఎల్పీవో కుమార్, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, జీసీసీ డీఎం పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రాలను స్వీకరిస్తున్న కలెక్టర్, పీవో

45 వినతుల స్వీకరణ

స్పందన కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలపై కలెక్టర్ సుమిత్‌కుమార్,ఇతర అధికారులు 45వినతులను స్వీకరించారు.

- జంగంపుట్టు నుంచి కించూరుకు రోడ్డు నిర్మించాలని పెదబయలు మండలం గుల్లెలు పంచాయతీ జంగంపుట్టు గ్రామానికి చెందిన ఎస్.పండన్న, టి.చిట్టిబాబులు కోరారు
- వై.సంపలు,.పోతురాజుమెట్ట, ఎస్,కొత్తూరు, దొడ్డిపల్లి,బొర్రమామిడి గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పాడేరు మండలం వంజంగి సర్పంచ్ వంతాల బొంజుబాబు వినతిపత్రం ఇచ్చారు.
- పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని పాడేరు మండలం బడిమెల గ్రామానికి చెందిన గడుగు నాగమణి, జి.శాంతమ్మ,కొర్రా సావిత్రి తదితర 32 మంది మహిళలు అధికారులను కోరారు.
- పాడేరు పట్టణంలోని బక్కలపనుకు.మెట్టవీధులకు రోడ్డు,తాగునీటి సదుపాయాలు కల్పించాలని గెమ్మెలి రాంబాబు కోరారు
- హుకుంపేట మండలం మత్స్యపురం ఉప సర్పంచ్ పి.చంద్రన్నపాత్రుడు మత్స్యపురం, ఊటగొప్పు, గున్నమామిడి గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

- ఆర్టీసీ విజయనగరం రీజియన్ ఈడీ చింతా సత్యనారాయణ

అడ్డతీగల: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నామని ఆర్టీసీ విజయనగరం రీజియన్ ఈడీ చింతా సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఆర్టీసీ కాంపెక్స్‌ను పరిశీలించారు. మరుగుదొడ్లు అసౌకర్యంగా ఉన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కాంప్లెక్సు వెనుక భాగంలో తుప్పలు తొలగించాల్సి ఉందన్నారు. సీలేరులో డిపో పూర్తయిన తరువాత అక్కడి నుంచి చింతూరు మండలం తులసిపాకలు మీదుగా అడ్డతీగల వైపు బస్సు సర్వీసులు నడుపుతామన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ నర్సీపట్నం వెళ్లేందుకు ఒక్క బస్స సర్వీసు లేదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే సిబ్బంది ద్వారా వివరాలు తెలుసుకున్న ఈడీ బస్సు సర్వీసు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎటపాకలో బస్సు డిపో ఏర్పాటుకు అనువైన స్థలాలు ఉన్నాయన్నారు.ఏలేశ్వరం డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అడ్డతీగల ఆర్టీసీ కాంప్లెక్సును పరిశీలిస్తున్న ఈడీ సత్యనారాయణ

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ రవినాథ్ తిల్‌హరి దంపతులు

విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ

రంపచోడవరం : స్థానిక పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో కర్రపెండలం, చిలకడదుంప విలువ ఆధారిత ఉత్పత్తులపై రెండు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా రెండువ రోజైన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పెద్దాపురం ఉద్యాన పరిశోధనా స్థానం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం జానకి ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ టి. క్రాంతి కుమార్, కె. వీరాంజనేయులు, ఎస్. ఆదర్శ, పి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పొందిన మహిళలతో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

బరువు తక్కువ పిల్లలపై ప్రత్యేకశ్రద్ధ

- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: ప్రతీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించి వారి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. పాడేరు డివిజన్ పరిధిలోని ఐసీడీఎస్ అధికారులతో భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమంపై శుక్రవారం ఆయన సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని పిల్లలు సక్రమంగా తినే విధంగా కార్యకర్తలు,ఆయాలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. మరీ బరువు తక్కువ ఉన్న చిన్నారులను గుర్తించి పాడేరు జిల్లా ఆస్పత్రిలోని పౌష్టికాహార పునరావాస కేంద్రానికి తరలించాలని సూచించారు.ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి, ఇందుకు సంబంధించిన ఫొటోలను తమకు పంపాలని ఆదేశించారు. బరువు తక్కువ ఉన్న పిల్లలకు సంబంధించి ప్రత్యేకంగా రిజిస్టర్లు ఏర్పాటు చేసి వారికి అందించే వైద్యసేవలు, పౌష్టికాహారం వివరాలు నమోదు చేయాలని సూచించారు. రక్తహీనత సమస్య ఉన్న తల్లులు, పిల్లలపైన ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. వారి ఆరోగ్య పరిరక్షణ బాధ్యత వైద్య, ఐసీడీఎస్ బృందాలపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, హాజరైన అధికారులు

క్లుప్తంగా

గోదావరి డెల్టాకు నీటి విడుదల

సీలేరు : గోదావరి డెల్టా భూములకు సీలేరు విద్యుత్‌కాంప్లెక్స్‌లోని డొంకరాయి జలాశయం నుంచి రోజుకు 2500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు సూపరింటెండింగ్ ఇంజినీర్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. గత ఏడాది డిసెంబర్ చివరి వారం నుంచి నీటి పారుదలశాఖ అధికారుల ఆదేశాలతో అవసరాన్ని బట్టి ఎప్పటికప్పుడు నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో డెల్టా భూములకు మరింత నీరు కావాల్సి ఉన్నందున శుక్రవారం నుంచి 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల మొదలు పెట్టామన్నారు. వారం రోజుల వరకు నీటి విడుదల కొనసాగుతుందన్నారు. ఇప్పటివరకు 6 టీఎంసీలు సీలేరు కాంప్లెక్సు నుంచి విడుదల అయిందని ఆయన పేర్కొన్నారు. ఇది కాకుండా పొల్లూరు విద్యుత్ కేంద్రంలో రోజు వారీ ఉత్పత్తి అనంతరం మరో 4,300 క్యూసెక్కులు గోదావరిలో చేరుతుందన్నారు. సీలేరు, డొంకరాయి, పొల్లూరు విద్యుత్‌కేంద్రాలలో ఉత్పత్తి ఆశాజనకంగా ఉందని ఎస్‌ఈ తెలిపారు.

హెచ్3ఎన్2పై వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం

మహారాణిపేట: దేశంలో కొత్త రకం ఫ్లూ హెచ్3 ఎన్2 వైరస్ వ్యాప్తి నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కేజీహెచ్, అంటు రోగుల ప్రభుత్వ ఆస్పత్రి, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పడకలు సిద్ధం చేశారు. సంబంధిత వైద్యులు కూడా అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. జ్వరం, తలనొప్పి, దగ్గు, జలుబుకు అవసరమైన మందులను కూడా సిద్ధంగా ఉంచారు. బాధితులకు పరీక్షలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వలంటీర్లు ఇంటింటి సర్వే కూడా చేపట్టారు.

- జ్వరంతో బాధపడుతూ కేజీహెచ్‌కు వచ్చే రోగులకు జనరల్ ఫిజీషియన్ వైద్యులు సేవలు అందిస్తున్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. కొద్ది రోజుల నుంచి ఓపీకి ఎక్కువగా జ్వరం, దగ్గు, తల, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న రోగులు వస్తున్నారన్నారు. దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలు ఉన్న వారు జాగ్రత్తలు తీసుకుని, వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ఆకును మలిచి.. అందంగా తీర్చిదిద్ది..

తాటాకులతో అందమైన కళాకృతులుగా తీర్చిదిద్దుతూ ఆదాయం పొందుతున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుతున్నారు. ప్రకృతి సంపదతో వీటిని తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. మండలంలోని తాటివాడకు చెందిన గిరి మహిళలు.



తాటాకులతో కళాకృతులు తయారు చేస్తున్న గిరిజన మహిళలు



తాటాకులతో చేసిన వస్తువులు

- తాటాకులతో ఆకర్షణీయంగా కళాకృతులు
- ప్రకృతి సంపద సద్వినియోగం
- నాబర్డు సహకారంతో మార్కెటింగ్
- నెలకు రూ.10 వేల ఆదాయం
- ఉపాధి పొందుతున్న పోలవరం నిర్వాసిత మహిళలు

రంపచోడవరం: మండలంలోని తాటివాడ గ్రామంలోని మడకం బాపిరాజుదొర కాలనీకి చెందిన గిరి మహిళలు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఓ స్వచ్ఛందసంస్థ సహకారంతో ఆర్థికంగా ఎదుగుతూ సాటి మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కారణంగా నిర్వాసితులైన వీరు కొన్నాళ్లపాటు ఉపాధి సమస్య ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో వీరికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రకృతి స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చింది. ఎస్‌ఎల్‌సీడబ్ల్యూ సహకారంతో తాటాకులతో సుమారు 35 రకాల వస్తువుల తయారీపై నెలరోజులపాటు శిక్షణ ఇచ్చింది. తయారు చేసిన వస్తువులను నాబార్డు ఏర్పాటుచేసే ఎగ్జిబిషన్ల ద్వారా మార్కెటింగ్ చేస్తున్నారు. ఇప్పుడు జాతీయస్థాయిలో జరిగే ఎగ్జిబిషన్‌కు సంబంధించి ఆర్డర్ రావడంతో వారంతా కళాకృతుల తయారీలో బిజీగా ఉన్నారు.

లేత ఆకులతో..

తాటి మొవ్వుకు తరువాత ఉండే ఆకులను సేకరించి వస్తువుల తయారీకి ఉపయోగిస్తున్నారు. వీటిని నీటిలో ఉడకబెట్టేటప్పుడు కావాల్సిన రంగు వేస్తారు. దీంతో తాటాకులన్నీ ఆ రంగులోకి మారుతాయి. ఉడకబెట్టడం వల్ల ఆకు సున్నితంగా మారుతుంది. వీటిని వినియోగించడం వల్ల వస్తువులు రెండేళ్లపాటు చెదరకుండా ఉంటాయని మహిళలు తెలిపారు.

మంచి డిమాండ్.

ఏజెన్సీ ప్రాంతంలో తాటాకులు విరివిగా లభ్యం కావడంతో పెద్దగా పెట్టుబడి లేకుండానే ఆదాయం పొందుతున్నారు. బొకేలు, ఫ్లవర్‌వైజ్, పూజ బుట్టలు, టోపీలు, ట్రేలు తదితర 35 రకాల వస్తువులను తయారుచేస్తున్నారు. పర్యావరణ హితమైనవి కావడంతో వీటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది.



తాటాకులతో చేసిన వస్తువులు

25 బ్యాచ్‌లకు శిక్షణ



ఏజెన్సీలో ఇప్పటి వరకు 25 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చాను. మహిళలు తయారు చేసిన వస్తువులను నాబార్డు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే ఎగ్జిబిషన్ల ద్వారా విక్రయిస్తున్నాం. శిక్షణ పొందిన వారికి హ్యాండ్ క్రాఫ్ట్స్ సహకారం ఉంటుంది. పెద్దగా పెట్టుబడి ఉండదు. స్థానికంగా ఉన్న వనరులను వినయోగించుకుంటూ ఇంటివద్ద నెలకు రూ.10 వేల వరకు ఆదాయం పొందుతున్నారు.

– మడకం బాపిరాజుదొర, ట్రైనర్, తాటివాడ

స్థానికంగా ఉపాధి



తాటాకులతో వస్తువుల తయారీతో ఉపాధి అవకాశం ఏర్పడింది. మరి కొన్ని వస్తువులు తయారీకి అర్డర్ ఇచ్చారు. నెల రోజులపాటు శిక్షణ పొందాం. ఇంటి వద్ద ఉంటూ కొంత సమయం కేటాయించడం ద్వారా వీటి తయారు చేసుకోవచ్చు. ప్రతినెలా నిలకడగా ఆదాయం పొందుతున్నాం. కుటుంబ పోషణకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నాం.

–కుంజం రామలక్ష్మి, సీతారం కాలనీ

జాతీయ చిత్ర కళాకారుల సంక్షేమానికి పెద్దపీట

- శిబిరం ఇన్‌చార్జి కనుమూరి శ్రీనివాస్



గీసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న చిత్రకళాకారుల బృందం

అరకులోయ రూరల్: జాతీయ చిత్ర కళాకారుల సంక్షేమానికి తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని చిత్రకళా శిబిరం ఇన్‌చార్జి కనుమూరి శ్రీనివాస్ తెలిపారు. అల్లూరి రిసార్ట్స్‌లో శుక్రవారం ఉభయ రాష్ట్రాల చిత్రకళాకారులు 22 మంది బృందంతో క్యాప్చర్ అరకువ్యాలీ అనే టైటిల్‌తో చిత్రకళా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న తెలుగు చిత్రకళాకారులందరినీ ఒకే తాటిపై తీసుకువచ్చేందుకే ప్రత్యేకంగా చిత్రకళా శిబిరం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ తెలుగు చిత్రకారుల సమాఖ్య ఆధ్వర్యంలో 2024లో హైదరాబాద్‌లో ×కళామతల్లికి అభిషేకం॰ పేరుతో చిత్రకళాకారుల మహాసభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సంఘ బలోపేతంలో భాగంగా మొదటి సారిగా ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో ఈ శిబిరం నిర్వహించినట్టు చెప్పారు. చిత్రకళాకారుల సంక్షేమానికి తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఎంతో సహకారం అందిస్తున్నాయన్నారు. కళాకారులు గీసిన చిత్రాలను శిబిరంలో ప్రదర్శించారు. కళాకారుల బృందం సభ్యులు కమాల్, చంద్రమోహన్, వెంకటరావు, రాజ్యలక్ష్మి , బాలయోగి, అప్పలరాం పాల్గొన్నారు.

‘బైజూస్’పై నిర్లక్ష్యం వద్దు

- యాప్‌ను సక్రమంగా వినియోగిస్తే విద్యార్థులకు మేలు
- అలసత్వం వహిస్తే కఠిన చర్యలు
- గోవాడ హైస్కూల్లో నిర్వహణ లోపంపై ఆర్జేడీ ఆగ్రహం



బైజూస్ వినియోగించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆర్జేడీ జ్యోతికుమారి

చోడవరం రూరల్/చీడికాడ: విద్యార్థుల విజ్ఞానాన్ని మరింత పెంచేందుకు ఉపకరించే బైజూస్ యాప్ వినియోగం పట్ల నిర్లక్ష్యం వహించరాదని, విద్యార్థులు యాప్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఉపాధ్యాయులకు విద్యాశాఖ ప్రాంతీయ ఉపసంచాలకులు ఆర్.జ్యోతికుమారి సూచించారు. శుక్రవారం ఆర్జేడీ మండలంలోని గోవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల విద్యాశాఖ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఉన్నత పాఠశాలలో ఆమె జరిపిన తనిఖీలో 8వ తరగతి విద్యార్థుల ఉపయోగార్థం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందచేసిన ట్యాబ్‌లలో బైజూస్ యాప్ వినియోగించడం లేదన్న సంగతి బయటపడింది. దీంతో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. బైజూస్ యాప్ ఉపయోగాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించాలని సూచించారు. ఈ విషయంలో ఇంకా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు రాసిన నోట్ పుస్తకాలను పరిశీలించిన ఆర్జేడీ జ్యోతికుమారి నోట్సులో సరిగా కరెక్షన్లు లేకపోవడం గుర్తించి, ఉపాధ్యాయుల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు తమ లోపాలను సరిదిద్దుకోవాలని, దీనిపై మండల విద్యాధికారి అధ్యక్షతన త్రీమెన్ కమిటీ ఏర్పాటు చేస్తామని, కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని వెల్లడించారు. టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ అమలు తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలోని నాడు–నేడు పనులను పరిశీలించారు. అనంతరం చోడవరంలోని మండల విద్యాధికారి కార్యాలయాన్ని పరిశీలించి, రికార్డుల నిర్వహణ బాగుందని మండల కార్యాలయ సిబ్బందిని అభినందించారు. ఆర్జేడీ వెంట మండల విద్యాధికారి బి.శ్రీనివాసరావు, సీఆర్పీ కె.వి.ఎం.నాయుడు ఉన్నారు.

ఆర్జేడీ చీడికాడ జెడ్పీ హైస్కూల్, జి.కొత్తపల్లి కె.జి.బి.వి.పాఠశాలలను సందర్శించారు. బైజూస్ కంటెంట్ గురించి ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధత గురించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంఈవో గంగరాజు తదితరులున్నారు.

వలస కూలీ మజిలీ విషాదాంతం



గంగాసాగర్ మృతదేహం, (ఇన్‌సెట్) గంగాసాగర్ (ఫైల్)

రాజవొమ్మంగి : పొట్ట చేత పట్టుకొని కలప నరికే పనులకు వెళ్లిన రాజవొమ్మంగికి చెందిన గిరిజన యువకుడు కలింకోట గంగాసాగర్ (26) విగతజీవిగా స్వగ్రామం చేరడంతో ఆ కుటుంబంలో విషాదం అలముకొంది. వలస పనులకు వెళ్లి అనుకోని రీతిలో మరణించిన గంగాసాగర్ మృతదేహం వారం రోజుల తరువాత శుక్రవారం స్వగృహానికి చేరుకోవడంతో రాజవొమ్మంగిలో విషాదం అలముకొంది. వివరాల్లోకి వెళితే కొంత మంది యువకులతో కలసి కలింకోట గంగాసాగర్ (అనిల్) అనే యువకుడు 3వ తేదీన గుంటూరుకు సుబాబుల్ కలప చెట్లు నరికే పనికి వెళ్లాడు. అయితే కూలి రేటు నచ్చక జట్టు కూలీల్లో కొంతమంది ఎవరికి వారు ఇంటిముఖం పట్టారు. వారిలో ఒకరైన గంగాసాగర్ చేతిలో సొమ్ములు లేక కొంత మేర నడిచి రాజవొమ్మంగి చేరుకొనే ప్రయత్నం చేశాడు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వచ్చే సరికి బాగా నీరసించిన గంగాసాగర్ గోదావరి ఒడ్డున సేదతీరాడు. ఆ తరువాత అక్కడే చనిపోయాడు. కాగా కొవ్వూరు పోలీసులు 7వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేశారు. పత్రికలలో వచ్చిన కథనాలకు గంగాసాగర్ చనిపోయి వుండవచ్చని భావించిన కుటుంబీకులు, తోటి జట్టు కూలీలు కొవ్వూరు వెళ్లి ఆరా తీశారు. అతనికి తరుచూ ఫిట్స్ వస్తాయని కుటుంబ సభ్యులు తెలిపారు. చనిపోయింది గంగాసాగర్ అని నిర్ధారించుకొన్నారు. దీంతో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్టు పట్టణ ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. గంగాసాగర్ తండ్రి ఇదివరకే చనిపోగా కుటుంబాన్ని పోషించుకొనేందుకు వలస వెళ్లిన ఒక్కగానొక్క కుమారుడు గంగాప్రసాద్ ఈ విధంగా మృతి చెందడంతో తల్లి కళ్యాణి దుఃఖానికి అంతులేకుండా పోయింది. కళ్యాణి స్థానికంగా ఓ పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తోంది. చేతికి అందివచ్చిన కొడుకు ఇలా ఒంటరిని చేసి వెళ్లిపోవడంతో కళ్యాణి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

రక్తదానంతో ప్రాణదానం

- కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు రూరల్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం చేసిన ఐటీడీఏ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను ఆయన అందజేశారు. సేకరించిన రక్తాన్ని సికిల్‌సెల్ ఎనీమియా, తలసేమియా తదితర రోగాలతో బాధపడుతున్న రోగులతో పాటు రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులు, రక్తం అవసరమైన గర్భిణులకు సరఫరా చేయాలని సూచించారు. ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ వి. అభిషేక్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి ఈశ్వరరావు, జిల్లా కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, కోశాధికారి అప్పారావు, సభ్యులు పి.సూర్యారావు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఉపమాకలో ముగిసిన పుష్పయాగోత్సవాలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాకలో వెంకన్న కల్యాణోత్సవాల్లో భాగంగా మూడురోజుల పాటు నిర్వహించిన స్వామివారి పుష్పయాగోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. నెల 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకు స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహించారు.అనంతరం మూడు రోజుల పాటు పుష్పయాగోత్సవాలు నిర్వహించినట్టు ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం మూలవిరాట్ సన్నిధిలో నిత్యాభిషేకాలు, అర్చనలు, బాలభోగనివేదన, రాజభోగనివేదన, నాలాయిర సేవా కాలం, తీర్థగోష్టి,ప్రసాద వినియోగం నిర్వహించినట్టు చెప్పారు.

అనంతరం కవాట బంధనం, ఆలయ శుద్ధి,అష్టదిక్పాలకులకు బలిహరణ పూర్తి చేశామన్నారు. సాయంత్రం కార్యక్రమాల్లో భాగంగా స్వామివారిని అమ్మవారిని అద్దాలమండపంలో ఉంచి పూలతో అలంకరించి, పవళింపు సేవలు నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంతో వారం రోజులపాటు కల్యాణోత్సవాలు, మూడు రోజుల పాటు నిర్వహించిన పుష్పయాగోత్సవాలు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. పుష్పాలంకరణలో స్వామివారిని దర్శించిన భక్తులు ఆనంద పరవశులయ్యారు.స్వామివారి ఉత్సవ మూర్తులను భక్తులకు అద్దంలో చూపించారు.ఈకార్యక్రమాల్లో అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు, సాయి, పాల్గొన్నారు.

సిమెంట్ శ్లాబ్ విరిగి పడి ఒకరికి గాయాలు



చిన్నబ్బాయి పనిచేసిన ప్రదేశం (ఇన్‌సెట్) పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న చిన్నబ్బాయి.

రాజవొమ్మంగి : టాయ్‌లెట్ నిర్మాణ పనుల్లో భాగంగా ఓ వ్యక్తిపై ఎత్తు నుంచి సిమ్మెంట్ శ్లాబ్ విరిగి పడడంతో తీవ్ర గాయాలపాలైన సంఘటన మండలంలోని కిమ్మిలిగెడ్డలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన ఇంటి యజమాని కంకిపాటి చిన్నబ్బాయి తలపై గోడ కూలిపోగా నుదురు, ముక్కు తదితర శరీరభాగాలకు గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో వున్న అతనిని కుటుంబీకులు వెంటనే 108 సహాయంతో రాజవొమ్మంగి పీహెచ్‌సీకు తరలించగా డాక్టర్ లిఖిత ప్రథమ చికిత్స చేసి నర్సీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఇంటర్నల్ బ్లీడింగ్ అయ్యిందని, స్కానింగ్ చేసి తక్షణ వైద్యం అందించాల్సి ఉంటుందని డాక్టర్ లిఖిత తెలిపారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థిని ఆకస్మిక మృతి

- ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలింపు
- మార్గంమధ్యలో బాలిక మృతి
- స్వగ్రామంలో అలుముకున్న విషాదం



మృతి చెందిన బాలిక మాతే సుపర్ణ

కొయ్యూరు: కొమ్మిక బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న మాతే సుపర్ణ(12) శుక్రవారం అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందింది. ఆమెకు శుక్రవారం ఉదయం ఫిట్స్ రావడంతో వెనువెంటనే కంఠారం ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడికి వెళ్లేటప్పటికీ బాలిక మరణించింది. ఈ విషయమై ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం నాతవరం మండలం సుందరకోట పంచాయతీ తొరడకు చెందిన సుపర్ణ కొయ్యూరు మండలం కొమ్మిక ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతుందన్నారు.

ఆమెకు శుక్రవారం ఉదయం ఫిట్స్ వచ్చి పడిపోవడంతో గమనించినా హెచ్‌ఎం సహా ఉపాధ్యాయులు కలిసి వెంటనే కంఠారం పీహెచ్‌సీకి తరలించగా, అప్పటికే విద్యార్థిని మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించినట్టు తెలిపారు. తక్షణమే సమాచారాన్ని సుపర్ణ కుటుంబ సభ్యులకు తెలియజేశామన్నారు. ఈ నెల 7న పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, అప్పుడు విద్యార్థులంతా ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యురాలు బేగం మాట్లాడుతూ బాలిక ఆస్పత్రికి రాక ముందే మార్గంమధ్యలో మరణించినట్టు తెలిపారు.బాలిక మృతికి కారణాలు తెలుసుకుంటున్నామన్నారు. మృతదేహాన్ని విద్యార్థిని స్వగ్రామం తొరడకు తీసుకెళ్లారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, నాయకులు గాడి సత్యనారాయణ తదితరులు పరామర్శించారు.

కన్నీటిపర్యంతమైన బంధువులు

కూతురు సుపర్ణ మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు లక్ష్మయ్య, నాగమ్మ, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. మంచి చదువులు చదివి కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటుందని భావించిన కూతురు ఇక లేదని తెలుసుకుని బోరున విలపించారు. కొడుకు కూడా ఆరు నెలల కిందట ఇదే విధంగా ఫిట్స్ వచ్చి మరణించాడని విషాదం వ్యక్తం చేశారు. కూతురుపై ఆశలు పెట్టుకుంటే ఇప్పుడు ఆమె కూడా లేకుండా పోయిందని బోరున విలపించారు. హెచ్‌ఎం సంధ్య, ఉపాధ్యాయులు బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.